జనావాసాల్లోకి అడవి పందులు

- మాదారంలో స్వైరవిహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కట్టడికి చర్యలు చేపట్టని అటవీ అధికారులు

తాండూర్: అడవిలో జీవనం సాగించాల్సిన అడవి పందులు జనవాసాల బాట పట్టాయి. రేయింబవళ్లు ఇళ్ల పరిసరాల్లో సంచారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తుండడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారు. వీటి నియంత్రణపై అటవీ శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో నిత్యం అడవి పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అదురు బెదురు లేకుండా కాలనీల్లోకి చొరబడుతున్నాయి. ఊరపందుల మాదిరిగానే అడవి పందులు ఇళ్లలోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అడవిపందులు కాలనీ వీధుల్లో కలియ తిరుగుతున్నాయి. ఒక్కోసారి ఇంటిలోకి చొరబడుతుండడంతో స్థానికులు దిక్కుతోచని పరిస్థితులను చవిచూస్తున్నారు. సమూహంగా సంచారం చేస్తున్న పందులు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని భయంతో వణికిపోతున్నారు.

అటవీ ప్రాంతానికి చేరువలో..



మాదారం టౌన్‌షిప్ కాలనీలో తిరుగుతున్న అడవి పందుల గుంపు

మాదారం టౌన్‌షిప్ చుట్టూపక్కల దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. కాలనీని ఆనుకుని గుట్ట ఉంది. మరోపక్క నీలాయపల్లె, ఏంవీకే త్రీ పరిసర ప్రాంతాలన్నీ వెదురు, ఇతర చెట్లతో అటవీ ప్రాంతం విస్తరించింది. కొంతకాలం నుంచి అటవీ సంరక్షణ చర్యలు చేపట్టడం, అక్కడికి ఎవరిని వెళ్లకుండా కట్టడి చేయడంతో సహజంగానే అటవీ జంతువుల సంతతి పెరిగింది. వీటిలో ముఖ్యంగా పందుల సంతతి పదుల సంఖ్య నుంచి వందల సంఖ్యలోకి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెద్దసంఖ్యలో పందులు పెరగడంతో కాలనీ వైపు రోజువారీగా వస్తున్నాయి. ఇళ్ల పరిసరాల్లోకి వచ్చి ఆహారాన్ని తింటున్నాయి. ఈ చర్య రోజువారీగా జరుగుతుంది. అడవి పందుల మూలంగా ఊర పందులు క్రమంగా దూరమవుతున్నాయి. ఒక్కోసారి అటవీ, ఊర పందులేవో గుర్తుపట్టకుండా ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

నియంత్రణ చర్యలు చేపట్టాలి

అడవి పందుల సంచారాన్ని నివారించడానికి అటవీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రోజువారీగా పందుల బెడద వల్ల ప్రజలు ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎవరు మీదనైనా దాడి చేసిన తర్వాత చర్యలు తీసుకోవడం కన్నా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం వల్ల ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ దిశగా అటవీ అధికారులు అడవి పందుల సంచారాన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రేంసాగర్‌రావుకు ఘన స్వాగతం

దండేపల్లి: మంచిర్యాల ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి, తొలిసారి ఆదివారం రాత్రి మంచిర్యాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు దండేపల్లి మండలం గూడెం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఆయన కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ చేతిలో చేయి కలిపారు.

లక్సెట్టిపేట: ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక చౌరస్తా వద్ద ఆయనను గజమాలతో సన్మానించారు. నాయకుల బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, 28వ వార్డు కౌన్సిలర్ పల్లపు సాయిభార్గవి, 33వ వార్డు కౌన్సిలర్ జగ్గారి సుమతి, ఆమె భర్త సంజీవ్, 29వ వార్డు కౌన్సిలర్ చైతన్య, ఆమె భర్త సత్యపాల్‌రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు.



లక్సెట్టిపేట: ప్రేంసాగర్‌రావును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

కిక్కిరిసిన బస్టాండ్

జన్నారం: మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. మండలకేంద్రంలోని బస్టాండ్ ఆదివారం మహిళలతో కిక్కిరిసింది. మంచిర్యాల, ఆదిలాబాద్ బస్సుల్లో ఎక్కుతుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.



క్లుప్తంగా

కాంగ్రెస్ సంబురాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

జన్నారం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కోసం ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆదివారం సాయంత్రం మండలంలోని కవ్వాల్‌లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నాయకుల కేక్ కట్ చేశారు. మహిళలు, స్థానికులకు పంపిణీ చేశారు. నాయకులు పోషగౌడ్, రాకేశ్, ఎజాస్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'నేనింతే' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మున్సిపల్ వైస్ చైర్మన్, కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో కవి రచయిత బోనగిరి రాజారెడ్డి రచించిన వచన కవితా సంపుటి నేనింతే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కవులు, రచయితలు రాజేశం, అల్లం రాజయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, ఐబీ సుబ్బాయమ్మ, వామన్‌రావు, నాగేంద్ర, శ్రీలక్ష్మి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడిగా అంజన్న



దండేపల్లి: ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడిగా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్‌కు చెందిన జిల్లపెల్లి అంజన్న ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ 69వ మహాసభల్లో తనను ఎన్నుకున్నట్లు ఆదివారం తెలిపారు. తనకు ఈ పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర కార్యవర్గాన్ని కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేతకానిలకే పెద్దపల్లి ఎంపీ టికెట్ కేటాయించాలి



నేతకానిలతో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

భీమారం: నేతకానిలకే పెద్దపల్లి ఎంపీ బీజేపీ టికెట్ కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని నేతకానిలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో నేతకాని కులస్తులు మెజార్టీ కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎంపీ స్థానం బీజేపీ కైవసం చేసుకునేందుకు నేతకానిలకే టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర లక్ష్మణ్, మండల నాయకులు మేడి విజయ, దర్శనాల మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ముస్లింల అల్పాహారం



అల్పాహారం వడ్డిస్తున్న ముస్లింలు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో అయ్యప్ప స్వాములకు గ్రామానికి చెందిన ముస్లిం నాయకుడు ముస్తాఫా అల్పాహారం అందించారు. స్వాముల కోసం అల్పాహారం వడ్డించారు. ముస్లింలు సల్లు, సాధిక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రిలో మా ఊరు సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇబ్రహీం ఆధ్వర్యంలో ఆదివారం 22 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవ దృక్పథంతో ఏర్పాటు చేసిన సంఘం ఆధ్వర్యంలో ప్రతీనెల పలువురు నిరుపేదలకు సరుకులు అందిస్తున్నట్లు ఇబ్రహీం తెలిపారు. సభ్యులు మల్లన్న, పెద్దిరాజు, లక్ష్మణ్, దశరథం, భీమ్‌సేన్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి రైల్వే రడగంబాల బస్తీలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తనపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అపరిష్కృతంగా, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనుల వివరాలను శాఖల అధికారులతో తెప్పించి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. తాగునీరు, రోడ్లు, సాగునీటి కాలువలు ఇత్యాది ప్రజాభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. పట్టణంలో అంతర్గత రోడ్లు, మురికి నీటి పారుదల సౌకర్యాలు సరిగా లేవన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులపై ఆరా తీస్తానని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. బెల్లంపల్లిలో నివాసం ఉండి ప్రజలకు సేవలందిస్తానని తెలిపారు. వారంలో నాలుగైదు రోజులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కె.రాంచందర్, మున్సిపల్ కౌన్సిలర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

క్యాంపు కార్యాలయం సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదివారం సందర్శించారు. కార్యాలయాన్నీ కలియ తిరిగి చేపట్టాల్సిన పనులను అధికారులకు సూచించారు. కొత్తగా భవనానికి సున్నం, రంగులు వేయించడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులకు పనుల నిర్వహణపై మార్గదర్శకం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, పై అంతస్తుకు వెళ్లి గదులు పరిశీలించారు. కాగా, అంతకు మూడురోజుల ముందు మున్సిపల్ సిబ్బంది క్యాంపు కార్యాలయంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించిన సంగతి తెలిసిందే.

జోనల్‌స్థాయి సైన్స్‌ఫేర్‌కు రావాలని ఆహ్వానం

తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల కుండీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు బాలికల గురుకులంలో జరగనున్న జోనల్‌స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. తనకు అత్యవసరంగా ఢిల్లీ వెళ్లే పని ఉందని, వీలైతే ముగింపు కార్యక్రమం వరకు హాజరవుతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

కాసిపేట: ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను ఆదివారం కాసిపేట ఎంపీడీవో ఎంఏ అలీం ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి సంక్షేమపథకాల అమలులో అన్నివర్గాలకు న్యాయం జరిగేలా తనవంతు బాధ్యతలు నెరవేర్చనున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే వినోద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపాళ్లు

అడుగుకో లీకేజీ..



ఫౌంటెన్ ను తలపిస్తున్న పైప్‌లైన్ లీకేజీ

- అస్తవ్యస్తంగా పైప్‌లైన్ నిర్మాణం
- ప్రారంభించిన నాటి నుంచే లీకేజీలు
- నిత్యం మరమ్మతుతోనే సరి

తాండూర్: తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అంతర్గత పైప్‌లైన్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పైప్‌లైన్ల బిగింపు అధికారుల నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోంది. మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణంలో 30 లీకేజీలు దర్శనమిస్తున్నాయి. ఎంచక్కా పబ్లిక్ పార్కుల్లో ఏర్పాటు చేసే వాటర్ ఫౌంటెన్లను పైప్‌లైన్ లీకేజీలు తలపిస్తున్నాయి. అధికారుల అధ్వాన నిర్వహణను వెక్కిరిస్తున్నాయి. పైప్‌లైన్ పనులు ప్రారంభించి ఆరునెలలు గడవకముందే ఊడిపోతుండడంతో నిర్మాణ పని ఎంత నాసిరకంగా జరిగిందో తేటతెల్లం చేస్తుంది. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్ సింగరేణి కార్మిక కాలనీలకు నీటిసరఫరా చేసే పైప్‌లైన్ మూడు లీకేజీలు ఆరు మరమ్మతులుగా కొనసాగుతోంది. గతంలో ఈ పైప్‌లైన్ నిర్మాణాన్ని కాంట్రాక్టర్‌కు సివిల్ అధికారులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ పని మధ్యలో వదిలివెళ్లడంతో మిగతా పనిని కార్మికులతో పూర్తిచేయించారు. కాంట్రాక్టర్ నాసిరకంగా పనిచేసే అధికారులకు అప్పగించి వెళ్లాడు. చేసిన పనికంటే అధికంగా బిల్లులు చెల్లించినట్లు గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. పని నాసిరకంగా ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఎలాగో అలా పైప్‌లైన్ నిర్మాణం పని పూర్తిచేసిన అధికారులు నీటి సరఫరా చేసేందుకు పూనుకున్నారు. కానీ నీటి సరఫరా ప్రారంభించిన నాటి నుంచే అడుగడుగుకు పైపులు ఊడిపోవడం, పైప్‌లైన్ లీకేజీలు కావడం షరామామూలే అయింది. ఇటీవల అధికారులు పైప్‌లైన్ మరమ్మతులు చేయకుండా ఉండని రోజులేదు అంటే లీకేజీల తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓ చోట లీకేజీని అరికట్టడం ముగుస్తుందో లేదో మరో కొన్నిచోట్ల పైప్‌లైన్ లీక్ అవడం పరిపాటిగా మారింది. దీంతో ఉన్న ఉద్యోగులను పైప్‌లైన్ మరమ్మతుకు వినియోగిస్తుండడంతో నిర్వహణ పెనుభారంగా తయారైంది. నిత్యం జరిగే ఈతంతు సివిల్ అధికారులకు పెద్ద తలనొప్పిగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని సదరు కాంట్రాక్టర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న కార్మికులు

వివక్ష లేని సమాజం కోసం కృషిచేయాలి



మొక్కలు నాటుతున్న మానవ హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు

పాతమంచిర్యాల: వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేరాల వంశీ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని హమాలీవాడలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం కోసం మన హక్కులు కాపాడుకోవాలన్నారు. సంఘం సభ్యులు కిరణ్, త్రినేష్, గౌస్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

14న రేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో ఈనెల 14న రేణుకా ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉందని సర్పంచ్ బుర్ర రాకేశ్‌గౌడ్ తెలిపారు. 12న గణపతి పూజ, 13న నిత్య పూజ, మూల మంత్రహవనల పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో స్తంభం!



దండేపల్లి: సాధారణంగా విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కన ఉంటాయి. దండేపల్లి మండలం ముత్యంపేట కొత్త ప్లాట్లలో మాత్రం రోడ్డు మధ్యన స్తంభం ఉంది. ఇన్నిరోజులు పార్మెషన్ రోడ్డు ఉండగా, పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు మధ్యలో స్తంభాన్ని తొలగించకుండా రోడ్డు వేయడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల తీరును విమర్శిస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

చెరువు నిండానీళ్లు.. బీళ్లుగా ఆయకట్టు



నిండుకుండలా రామారావుపేట పెద్దచెరువు



బీళ్లుగా చెరువు ఆయకట్టు సాగు

జైపూర్: మండలంలోని ఇందారం-రామారావుపేట పెద్ద చెరువు నీటితో కళకళలాడుతోంది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు సాగు పచ్చదనం పర్చుకున్నట్లుగా కనిపించేది. కానీ మూడేళ్లుగా రైతులు పంటలు సాగుకు దృష్టిపెట్టడం లేదు. వర్షాకాలంలో పెద్ద చెరువులోకి వర్షపు నీరు వస్తుండగా, మరోపక్కన శ్రీరాంపూర్ ఓసీపీ నీరు వచ్చి చేరుతోంది. ఓసీపీ నీళ్లతో పంటలు సాగు చేయక బీళ్లుగా మారుతున్నాయి. కొందరు రైతులు పంటల సాగుకు మొగ్గుచూపడం లేదు. దీంతో ఉపాధి కరువైతుందని కూలీలు వాపోతున్నారు.

'రాముని చెరువు' నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని రాముని చెరువు కట్టపై ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో గజెల్లి వెంకటయ్య అత్యధిక మెజార్టీని సాధించి అధ్యక్షుడిగా ఎన్నికకాగా, న్యాయవాది కర్రె లచ్చన్న, కైరం జనార్దన్, ఎం.రంగారావు, సీహెచ్ రమేశ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అధ్యక్షుడి కోసం పోటీపడ్డ గజెల్లి వెంకటయ్యకు 172 ఓట్లు, మొగిలి తిరుపతికి 10 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా సిద్ధంశెట్టి ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలపై కొందరు వాగ్వాదం చేయడంతో, పోలీసులు వచ్చి ఇరువర్గాలతో మాట్లాడి గొడవను సద్దుమణిగేలా చేశారు.

ఎన్నికల చెల్లదంటూ ఫిర్యాదు

రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ ఎన్నికలు చెల్లవంటూ కనుకుంట్ల మల్లయ్య, మొగిలి తిరుపతి మున్సిపల్ చైర్మన్ మారుతి ప్రసాద్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అసోసియేషన్‌ను తాము 2018లో రిజిస్ట్రేషన్ చేశామని, అప్పటినుంచే తాము అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగుతున్నామన్నారు. తమ అనుమతి లేకుండానే బయటి వ్యక్తులు ఎన్నికలు నిర్వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నత్తనడకన పనులు



దండేపల్లి: మండల కేంద్రం నుంచి నర్సాపూర్ వెళ్లేందుకు గల బీటీ రోడ్డు శిథిలం కావడంతో దాని స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గతరెండు నెలల క్రితం చేపట్టిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు నరక యాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంపు..కంపు



భీమిని: మండలంలోని వీగాం పంచాయతీలో చెత్త నిర్వహణ సరిగా చేపట్టడం లేదు. భీరన్న ఆలయం సమీపంలో చెత్త డంప్‌చేస్తున్నారు. భరించలేని కంపు రావడంతో భక్తులు ముక్కుమూసుకుంటున్నారు. పరిసరాల్లోని గృహాలకు సైతం ఇబ్బందిగా మారింది. పంచాయతీలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కాలనీలన్ని కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.